క్లుప్తంగా

లక్ష్మీదేవికి ఘనంగా పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి : స్థానిక వెంకటాద్రిపై ఫాల్గుణ పక్షోత్సవాల్లో భాగంగా 11వ రోజు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీమహాలక్ష్మి అమ్మవారికి శ్రీసూక్త పారాయణ, ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీ హవనం, కుంకుమ పూజలు చేశారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

నేటి నుంచి శబల భోజన పండగ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంకి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు శబల భోజన పండగ నిర్వహించనున్నట్టు ప్రకృతి వ్యవసాయ ప్రచారకులు విజయ్‌రామ్ తెలిపారు. గోవు ఆధారిత పంటలు, సాంప్రదాయ వంటలు, ప్రకృతి వ్యవసాయం, దేశవాళీ విత్తనాల వ్యాప్తి, స్థానిక ఆహారపు అలవాట్లు, వంట పాత్రల వాడకం, స్థానిక చేతి వృత్తుల వారికి ఉపాధి అవకాశాలపై అవగాహన కలిగించడం కోసం సేవ్ సంస్థ ఐదు రోజుల పాటు భోజన పండగ నిర్వహిస్తోందన్నారు. 30 రకాల బియ్యాలతో వంటలు వండటం, వాటిని తినడం వల్ల చేకూరే ఆరోగ్యలాభం వివరిస్తామన్నారు. గోవు ఆధారిత పంటలు పండించే వారికి, అలాంటి పంటలు కోరుకునే వారికి పరిచయ వేదిక ఏర్పాటు చేస్తామన్నారు.

డౌన్ సింఢ్రోమ్‌పై ర్యాలీ



ర్యాలీలో దివ్యాంగ పిల్లలు, సంస్థ ప్రతినిధులు

పెందుర్తి: ప్రపంచ డౌన్ సింఢ్రోమ్ డే సందర్భంగా సుజాతనగర్‌లో శ్రేయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కలిగించారు. సంస్థ ప్రతినిధులు ఎం.భాగ్యలక్ష్మి, కె.సంతోషి, కె.కుమారి, కె.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పెందుర్తి : చినముషిడివాడ వుడా కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్ - 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. సుజాతనగర్ బి - జోన్, సప్తగిరినగర్, హస్మినగర్, గ్యాస్ గొడౌన్, గణేష్‌నగర్, బ్యాంక్ కాలనీ, వుడా కాలనీ, రైలు విహార్, వీరనగర్, అంబేడ్కర్ నగర్, చినముషిడివాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ఆర్థిక లావాదేవీలతో గృహిణి ఆత్మహత్య



సత్యశాంతి (ఫైల్)

పెందుర్తి : ఆర్థిక లావాదేవీల్లో మోసపోయిన వేపగుంట సమీపంలోని కృష్ణరాయపురానికి చెందిన ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... గండ్రెడ్డి శ్రీనివాసరావు, సత్యశాంతి(36) కృష్ణరాయపురం సంతోష్‌నగర్ సమీపంలో నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు సంతానం. స్థానికంగా మహిళలు సమూహంగా పప్పుల చీటీలు వేసుకున్నారు. ఆయా నగదును సత్యశాంతి వద్ద వుంచారు. అధిక వడ్డీలు వస్తాయన్న ఆశతో చిట్టీల నగదుతోపాటు తన సొంత నగదు కలిపి దాదాపు రూ.50 లక్షలు గుమ్మడి నానాజీ, దాసరి నాయుడు అనే వ్యక్తులకు సత్యశాంతి అప్పుగా ఇచ్చింది. అయితే కొన్నాళ్లుగా ఆ నగదు విషయంలో సత్యశాంతికి, నానాజీ, నాయుడుకు మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన చావుకు నాయుడు, నానాజీలే కారణమని సూసైడ్ నోట్ రాసింది. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న పెందుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు నిందితుల్లో ఒకరు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- 282 కేంద్రాల్లో 140 వరకు సమస్యాత్మకంగా గుర్తించాం
- ఎన్నికల నియమావళిపై కఠినంగా వ్యవహరిస్తాం
- అభ్యర్థుల ఖర్చు పరిశీలనకు 30-40 మందితో ప్రత్యేక బృందాలు
- సాక్షి ఇంటర్వ్యూలో పెందుర్తి రిటర్నింగ్ అధికారి శేష శైలజ



పెందుర్తి: సార్వత్రిక ఎన్నికల వేళ అన్ని రాజకీయ పార్టీలు ఎత్తులకు పైఎత్తులు వేసుకుంటున్నాయి. విజయం కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. రాజకీయ పార్టీలు ఈ ఎన్నికలను చావోరేవో అన్నట్లు తీసుకుంటున్న వేళ ఎన్నికల నిర్వహణ యంత్రాంగానికి కత్తిమీద సామే. అయితే ఎన్నికలకు తాము సర్వం సిద్ధమయ్యామని.. ప్రణాళికాబద్ధంగా.. పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని పెందుర్తి నియోజకవర్గ ఎన్నికల అధికారి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ పి.శేష శైలజ తెలిపారు. ప్రతి అభ్యర్థిపై ప్రత్యేక నిఘా ద్వారా ఎన్నికల ఖర్చును అదుపులో ఉంచుతామన్నారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించిన వారిని ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించబోమన్నారు. వివిధ శాఖల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎన్నికలను నిర్వహించడమే తమ ముందున్న లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. మే 13న జరగనున్న ఎన్నికలపై నియోజకవర్గ కేంద్రం పెందుర్తిలో గురువారం ఆమె 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

సాక్షి: ఎన్నికల ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయి.?

ఆర్వో: ఏర్పాట్లు చురుగ్గా, ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయి. ఇప్పటికే దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించాం. ప్రతి రోజూ అన్ని శాఖల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనిస్తున్నాం.

సాక్షి: ఎన్నికల కోడ్ అమలు ఎలా ఉంది? ఫిర్యాదులేమైనా వచ్చాయా?

ఆర్వో: ఎన్నికల కోడ్ వ్యవహారంలో చాలా కఠినంగా ఉంటాం. ఇప్పటికే రాజకీయ పార్టీల ప్రచార బోర్డులు, ఫ్లెక్సీలు తొలగించాం. ఎటువంటి ప్రభుత్వ కార్యాక్రమాలు నిర్వహించకుండా ఆదేశాలిచ్చాం. ప్రస్తుతానికి కోడ్ ఉల్లంఘనలపై లిఖిత పూర్వకంగా ఎటువంటి ఫిర్యాదులు రాలేదు. రాజకీయ నాయకులే కాదు.. ప్రజలు కూడా కోడ్ ఉల్లంఘనలపై సి.విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

సాక్షి: శాంతిభద్రతల పరిస్థితి ఏమిటి?

ఆర్వో: ఎన్నికల నిర్వహణను మేం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. ఎన్నికల విధులకు గానీ, ప్రజలకు గానీ ఇబ్బందులు కలిగించేవారు ఎంతటివారైనా ఉపేక్షించం. దీనిపై ప్రత్యేక పోలీసు బలగాలు ఏర్పాటు చేశాం. సున్నితమైన అంశాలపై అభ్యర్థులు, రాజకీయ పార్టీలు జాగ్రత్తగా వ్యవహరించాలి. కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే వ్యవహారం ఎవరు చేసినా అభ్యర్థిత్వం కూడా రద్దు చేసే అధికారం మాకుంది. ఎన్నికల నిర్వహణకు ప్రతి మండలంలోనూ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాలతో పాటు అవసరమైన చోట డ్రోన్లను కూడా వాడతాం.

సాక్షి: ర్యాలీలు, ఇతర సమావేశాలకు అనుమతి ఎలా తీసుకోవాలి?

ఆర్వో: అభ్యర్థులు ర్యాలీలు, సమావేశాలకు అనుమతి కావాలంటే సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మేం పరిశీలించి ఆన్‌లైన్ ద్వారానే నిర్ణీత సమయంలో అనుమతులు జారీ చేస్తాం. ప్రజలు కూడా సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

సాక్షి: నియోజకవర్గంలో ఓటర్లు ఎంత మంది?

ఆర్వో: నియోజకవర్గంలో మొత్తం 2,99,103 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 1,48,576, స్త్రీలు 1,50,522 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు. వీరిలో 6,351 మంది యువ ఓటర్లు ఉండగా.. 80 ఏళ్ల వయసు దాటిన వారు 3,676 మంది ఉన్నారు.

సాక్షి: పోలింగ్ కేంద్రాలు ఎన్ని? సమస్యాత్మకమైనవి గుర్తించారా?

ఆర్వో: నియోజకవర్గంలో మొత్తం 282 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మరో 17 అనుబంధ పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయి. గత ఎన్నికల్లో జరిగిన కొన్ని ఘటనలు, ఇతరాత్ర విషయాలను పరిగణనలోకి తీసుకుని వాటిలో సగం పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మకంగా గుర్తించాం. అందులో తీవ్ర సమస్యాత్మకమైనవి 30-40 వరకు ఉండొచ్చు. అన్ని కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాం.

సాక్షి: అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై ఎలా దృష్టి పెట్టబోతున్నారు?

ఆర్వో: అభ్యర్థులు ఎన్నికల నియమావళిని అనుసరించే ఖర్చు చేయాల్సి ఉంటుంది. నియమావళిని ఎవరు మీరినా తగిన చర్యలు తీసుకుంటాం. ఖర్చు లెక్కింపు కోసం 30-40 మందితో అబ్జర్వ్ బృందాలు ఏర్పాటు చేశాం. వారంతా అభ్యర్థుల ఖర్చును లెక్కిస్తారు. నియోజకవర్గంలో ప్రతి చోటా వారు ఉంటారు. ఎన్నికల ఖర్చుపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఇప్పటికే ఒకసారి మార్గనిర్దేశనం చేశాం.

సాక్షి: ప్రైవేటు భవనాలపై రాజకీయ నాయకుల ఫొటోలు, జెండాలు ఉండవచ్చా?

ఆర్వో: ప్రైవేటు భవనాలు, ఇళ్లల్లో వారి అభీష్టం మేరకు రాజకీయ నాయకుల ఫొటోలు, జెండా ఉంచుకోవచ్చు. అలాగే ఈసీ తాజా ఆదేశాల మేరకు ప్రభుత్వం విద్యార్థులకు, ప్రభుత్వ పథకాలకు నోటిఫికేషన్‌కు ముందు పంపిణీ చేసిన పత్రాలు, పుస్తకాలు, ఇతర వస్తువులపై ఉన్న ఫొటోలపై ఎలాంటి అభ్యంతరాలు లేవు. నోటిఫికేషన్ తరువాత అలాంటి పంపిణీలు జరిగితే మాత్రం కేసులు నమోదు చేస్తాం.

సాక్షి: ప్రజల సందేహాల నివృత్తికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారా?

ఆర్వో: సార్వత్రిక ఎన్నికల కోసం పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. ఫిర్యాదులు, సందేహాలు, ఇతర అంశాల గురించి తెలుసుకునేందుకు హెల్ప్‌లైన్ నంబర్: 90637 83289ను అందుబాటులో ఉంచాం.

ముత్యాలమ్మతల్లి పండగకు భారీ ఏర్పాట్లు



అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న సర్పంచ్ నారాయణమూర్తి, తదితరులు

సబ్బవరం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి అంతకాపల్లి శ్రీముత్యాలమ్మ అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు పనులను గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి గురువారం పరిశీలించారు. ఈ జాతర ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపాసారు. ఈ వేడుకలో భాగంగా గురువారం ఉదయం అమ్మవారికి దూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి జాతరను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, గొంప ముత్యాలనాయుడు, గొంప శేఖర్, గండి మాలినాయుడు, అడిగర్ల రాజు, సబ్బవరపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగే ఈ పూజలో పాల్గొనేందుకు రూ.500 చెల్లించిన దంపతులను లేదా ఇద్దరు భక్తులను అనుమతించనున్నట్టు కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అధికారులు, అర్చకుడు, భక్తులు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం : ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన వైభవంగా జరిపారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

ఘనంగా సీతారాముల వార్షిక కల్యాణోత్సవం



తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు

సింహాచలం: సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో గురువారం రాత్రి సీతారాముల వార్షిక కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపంలో అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. భక్తులకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సతీ సమేతంగా పాల్గొన్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు పవన్, శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జాబ్‌మేళాలో 60 మందికి ఉపాధి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెం సమీపంలోని నిస్ట్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 60 మంది డిగ్రీ విద్యార్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు దక్కించుకున్నారు. నాంది ఫౌండేషన్, మహేంద్ర ప్రైడ్ సంయుక్తంగా నిర్వహించిన మేళాలో 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. ఈ ఎంపికలో విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న 6 వందల మంది విద్యార్థులు పాల్గొనగా 60 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. నాంది ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ జోయోలిన్ హెప్సిబా, నిస్ట్ చైర్‌పర్సన్ వీరాజమ్మ, ప్రిన్సిపాల్ హనీపుద్దీన్, నాంది ఫౌండేషన్, మహేంద్ర ప్రైడ్ ప్రతినిధులు ప్రవీణ్‌కుమార్, హరికుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

టోల్‌గేటు వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీ



టోల్‌గేటు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు

అగనంపూడి: మే నెలలో నిర్వహించనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో అగనంపూడి టోల్‌గేటు వద్ద వివిధ విభాగాల అధికారు లు వాహనాల తనిఖీ చేపట్టారు. విశాఖ నగర కమిషనర్ ఎ.రవిశంకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గాజువాక సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే కార్లు, ఇతర వాహనాలను నిలిపి తనిఖీ చేస్తున్నారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు వస్తు, డబ్బు రూపంలో వస్తున్న రవాణాను అరికట్టేందుకు విస్తృత తనిఖీలు చేపడుతున్నట్టు వారు తెలియజేశారు. నగదు, మద్యం, బంగారు ఇతర వస్తువుల అక్రమ రవాణా అరికట్టడం లక్ష్యమని అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు తెలిపారు.

ఇంటర్వ్యూల్లో 20 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో విస్తం ప్రతినిధులు

పెందుర్తి : పెందుర్తి మండలం పినగాడి సమీపంలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీలో 10 మంది ఇంజినీరింగ్, 10 మంది డిప్లమా విద్యార్థులకు కొలువులు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.శివకుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఇ.కిరణ్‌కుమార్, డెక్కన్ ఫైన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రయ్‌రయ్‌మంటూ ప్రయాణం

'పెందుర్తి - సబ్బవరం - అనకాపల్లి రహదారిపై నిత్యం వేలాది వాహనాల్లో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ రోడ్డు పూర్తిగా గోతుల మయం కావడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవాళ్లం. ఏడాది క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రోడ్డు బాగు చేసింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బందీ లేకుండా రాకపోకలు సాగిస్తున్నాం' అని సంతోషం వ్యక్తం చేస్తున్నారు పినగాడికి చెందిన ఆటో డ్రైవర్ రమేష్.

'పెందుర్తి కూడలి నుంచి ఆనందపురం వైపు వెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. ఓ వైపు వాహనాల రద్దీ... మరోవైపు ఇరుకు రోడ్డు. రోడ్డు నిండా గోతులు. ఇలా చాలా అవస్థలు పడేవాళ్లం. అయితే ఏడాది క్రితం మా సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుసుకుని వెంటనే మరమ్మతులకు నిధులు విడుదల చేశారు. ఇప్పుడు రోడ్డు వెడల్పు చేయడంతో చాలా సౌకర్యవంతంగా ప్రయాణం చేస్తున్నాం' అని ఆనందం వ్యక్తం చేస్తున్నారు పెందుర్తికి చెందిన గణేష్.

- సుందరంగా పెందుర్తి - సబ్బవరం - అనకాపల్లి బైపాస్
- రూ.11.84 కోట్లతో రహదారికి మరమ్మతులు
- వేలాది వాహనాల రాకపోకలకు మార్గం సుగమం



సాధుమఠం వద్ద ఆధునికీకరించిన రహదారి



అక్కిరెడ్డిపాలెం వద్ద విశాలంగా అనకాపల్లి - ఆనందపురం పాతరోడ్డు

పెందుర్తి : గతంలో ప్రయాణం చేయడమే కష్టంగా ఉండే పెందుర్తి - సబ్బవరం - అనకాపల్లి రోడ్డు ప్రస్తుతం అత్యంత సుందరంగా మారింది. అనకాపల్లి - ఆనందపురం బైపాస్ పూర్తి స్థాయి రహదారి నిర్మాణం జరుగుతుండడంతో పెందుర్తి - సబ్బవరం - అనకాపల్లి (పాత బైపాస్) రోడ్డు పూర్తిగా గోతులమయం అయింది. దానికి వర్షాలు కూడా తోడవడంతో రోడ్డు పూర్తిగా పాడైంది. దీంతో అనకాపల్లి జిల్లా నుంచి సబ్బవరం మీదుగా నగరానికి వెళ్లే వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడేవారు. దీర్ఘకాలంగా ఉన్న ఈ రోడ్ సమస్యను గుర్తించిన ప్రభుత్వం ఏడాది క్రితం రూ.11.84 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో రోడ్డు మరమ్మతులు నాలుగు నెలల క్రితం పూర్తి చేశారు. దీంతో నాలుగైదు మండలాల ప్రజల రాకపోకలకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా మారింది. ఇప్పుడు ఆయా మార్గాల్లో ప్రజలు హాయిగా రాకపోకలు సాగిస్తున్నారు.

వీరమ్ బ్లాక్ ప్రారంభం



వీరమ్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న నేవల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అడ్మిరల్ హరికుమార్

సింధియా: విశాఖపట్నంలోని నౌశక్తినగర్‌లో డీఎస్సీ సిబ్బంది (492 మంది పురుషులు) కోసం వసతి భవనం వీరమ్ బ్లాక్‌ను గురువారం నేవల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అడ్మిరల్ ఆర్ హరికుమార్, పీవీఎస్ఎమ్, ఏవీఎస్ఎమ్, వీఎస్ఎమ్ ప్రారంభించారు. వీరమ్ బ్లాక్‌లో బయోగ్యాస్ ప్లాంట్‌తో కూడిన కుక్ హౌస్, వ్యాయామశాల, వినోద పరికరాలు, గ్రంథాలయ సౌకర్యాలతో కూడిన అత్యాధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు నేవీ వర్గాలు తెలిపాయి.

జాతీయ సదస్సు ప్రారంభం

ఎంవీపీ కాలనీ: స్థానిక గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో మూడు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. బయో ఇన్ఫర్‌మేటిక్స్ అంశంపై అధ్యాపకుల అభ్యున్నతికి ఆన్‌లైన్ విధానంలో ఈ సదస్సును కళాశాల మైక్రోబయాలజీ విభాగం, కేరళకు చెందిన ఎక్స్‌ప్లోజన్ బయో ఎక్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి.

పోలీస్ శాఖకు 120 బీపీ మెషీన్లు అందజేత



సీపీ రవిశంకర్‌తో సేవాసంస్థ ప్రతినిధులు

విశాఖ సిటీ: నిత్యం ఒత్తిడితో విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సూచించారు. సీపీ సమావేశ మందిరంలో జీతో సేవా సంస్థ రూ.1.6 లక్షలు విలువ చేసే 120 బీపీ మెషీన్లను పోలీస్ కమిషనర్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలన్నారు. ట్రాఫిక్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఈ బీపీ మెషీన్లను ట్రాఫిక్ అవుట్‌పోస్టులలో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. వీటి సాయంతో డ్రైవర్లు బీపీ తనిఖీ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. జీతో సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-1 వి.ఎన్.మణికంఠ, డీసీపీ-2 ఎం.సత్తిబాబు, ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు, జీతో సేవాసంస్థ ప్రతినిధులు ఆశిష్ ధరివాల్, నికేష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



గాంధీనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్సీ, సిబ్బంది

ఆరిలోవ: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ జోన్-2 కమిషనర్ జి.శైలజావల్లి తెలిపారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల వద్ద గురువారం ప్రారంభమైన ర్యాలీ తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు సాగింది. అక్కడ మానవహారం నిర్వహించి, ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ «మీ ఓటు-మీ భవిష్యత్» పేరుతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ఓటు ఆయుధంలాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో రూట్ ఆఫీసర్లు, సెక్టర్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్ఎం కప్ వాలీబాల్ టోర్నీ ప్రారంభం



వాలీబాల్ మెన్ పోటీల్లో స్పైక్‌ను బ్లాక్ చేస్తున్న ఆటగాళ్లు

విశాఖ స్పోర్ట్స్: డీఆర్ఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్ గురువారం రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభమైంది. మెన్‌లో ఎనిమిది జట్లు, వుమెన్‌లో నాలుగు జట్లు నాకవుట్ కమ్ లీగ్ పద్ధతిలో తలపడుతున్నాయి. ఈ పోటీలను డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన జట్లను అభినందించారు. రైల్వే స్టేడియంలో పూర్తిస్థాయి క్రీడా వసతులున్నాయన్నారు. ఈ నెల 24తో ముగియనున్న టోర్నీ పోటీలను ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్, ఈకోర్స్ వాల్తేర్ క్రీడాధికారి ప్రవీణ్ బాటి, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.